వాయు దేవుణ్ణి తన ఖైదీగా పట్టుకొని, అహస్కరుడు క్షణ, క్షణానికి విజృంభిస్తూ నిప్పుశరములను సూటిగా భూమిపైకి విడుస్తున్నాడు.

వొళ్ళంతా మండిపోతున్న భూతధాత్రి, వరుణదేవుని రాకకై ఉప్పరవీధిలోకి చూస్తూ, పరితపిస్తుంది.




# చక్రడోల

## యస్. సత్యనారాయణ

అహోర్పతి ఆగ్రహానికి భీతి: చెందిన ఆ బస్‌స్టాండ్‌లోని, బస్‌కై నిరీక్షిస్తున్న ప్రయాణికులు నీడను ఆశ్రయించి, గోడలకు వొరిగి నిల్చున్నారు. అంత విశాలమైన ఆ బస్‌స్టాండ్‌లో చెప్పుకోటానికి, ఒకచిన్న వేపచెట్టు మాత్రమే వుంది. రోడ్డు కిరువైపులా రక, రకాలయిన కొట్లున్నాయి.

ఆచారి హిదదారిత్యు వచ్చాడక్కడికి. బక్క, పలుచని ఆచారివయసు అరవై సంవత్సరాలు. అంతర్గతంగా అయితే. బహిర్గతంగా చూస్తే చాల ముసలి వానిలా కనపడ్తాడు ... ఎండలోనె కొన్నిగంటల దీర్ఘ ప్రయాణము చేస్తు వచ్చాడు — అందుకే నీడకు వెళ్ళి నిల్చోటానికి తొందరపడలేదు... వరుసగా కొన్ని కొట్లువున్న డాబా ఇంటి ముందు, హోటల్‌గద్దె నీడన గొలుసుతో కట్టివేసివున్న కుక్కతప్ప ఎవ్వరూ కనబడ లేదు... మెట్లెక్కాడు — హోటల్ యజమాని ముద్దులకుక్క, తన రొట్టెముక్కల కేదో విఘాతం కలిగినట్లు అరుస్తూ గింజుకో సాగింది. అశక్తితో వున్న ఆచారి బరువుగా పెదడుగులు వెనక్కు గెంతి, మూసి వున్న కిరాణ కొట్టుముందు నిల్చొన్నాడు... కుక్క తన కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగిస్తోంది... ఆచారి రెండు రోజుల ఆకలిని దిగమింగుకొంటు — ఆశగా కుక్కవైపే చూస్తున్నాడు... తలనుండి, మొఖాన్నుండి వెలుతున్న స్వేద బిందువులు, గుండెమీదినుండి జారి చాతిపై స్వేద బిందువులతో కలిసి, మాసిన అంగిని తడిపేస్తున్నాయి... తడి ఆరిన పెదవులను, పదునులేని నాలుకతో స్పృశిస్తూ తలుపులను ఆనుకొని నిల్చొన్నాడు.

ఇద్దరు వ్యక్తులు సంతోషంగా మాట్లాడుకుంటు; మధ్య, మధ్యన జబ్బలపై చరుచుకొని గొల్లున నవ్వుతు, మెట్లెక్కి సిగిరెట్లు కాల్చుకుంటు, కుక్క ప్రక్కనే నిల్చొన్నారు.

కుక్క తింటున్న రొట్టె ముక్కల్ని వదలి తోక ఆడిస్తూ; వాళ్ళ కాళ్ళ మధ్యన సంతోషంగా ఆడటం ప్రారంభించింది.

కుక్క తారతమ్య భావానికి నొచ్చుకున్నాడు. స్వసానుభూతి చూపుకొన్నాడు. కుక్కపట్ల ద్వేషముతో చూస్తూ తలపైకి ఎత్తాడు... తళ, తళ మెరిసిపోతున్న ఆ యిద్దరి వ్యక్తుల నల్లని—పంకెళ్ళ జుత్తును ఓ అర నిముషం పాటు చూశాడు. తన వెంట్రుకలను తడిమి చూసుకున్నాడు. అవి గతుకుగా—గడ్డితో అల్లుకున్న పిట్టగూడువలె తాకింది... అందముగా వున్నవారి మొఖాల్ని చూశాడు. బహూశా సంవత్సరం క్రితమేమో తన మొఖాన్ని ఓ సత్రంలోని అద్దంలో చూసుకున్నాడు—వెనుక ఎవరైనా నిల్చొన్నరేమోనని అనుమానంతో తిరిగి చూశాడు. ఎవ్వరు కనబడలేదు. అది తన స్వంత మొఖమయినందుకు ఆశ్చర్యపోయాడు. కనిపించే కాస్త మొఖం నల్లగా— బొద్దుగాను; ఎక్కడో తాక్కున్న కత్తుకు—కంటిపాపలు కాపలా వున్నట్లు; గడ్డము—మీసాలు పెదవులను చంపేసి వాటిచోటు ఆక్రమించుకున్నట్లు కనిపించిన గతాన్ని గుర్తు తెచ్చుకున్నాడు—నేటికి పోల్చుకున్నాడు. "ఛీ ఛీ వింత అసహ్యం!" లో లోన గొణుక్కుంటు సిగ్గుపడి పోయాడు...వారు ధరించిన దుస్తుల్ని చూశాడు. అవి ఏ రకానికి చెందినవో—వాటి ఖరీదు ఎంత వుంటుందో, ఈ జన్మలో తేల్చటం కల్ల అని తెలుసుకున్నాడు. వారు విరుగబడి నవ్వుతు ఆచారి వైపు చూశారు. ఆచారి తడబడ్తూ ఇంకో వైపు చూశాడు... అక్కడో పిచ్చివాడు అరటి తొక్కల్ని తింటు, మధ్య మధ్య చాల స్వతంత్రంగా వాగుతు, చిందులు వేస్తు కనిపించాడు. వాడి బట్టలను చూశాడు—తనవి చూసుకున్నాడు. వాడి బట్టలు కొంచెం నయమనుకున్నాడు. తిరిగి అరమోడ్పు కన్నులతో వారి కాళ్ళను చూశాడు. వాటికి ధరించిన జోళ్ళనుచూసాడు మేజోళ్లను చూసాడు. తన కాళ్లను చూసుకొన్నాడు. ఒక జోడు కాళ్ళు కనబడ్డాయి—కాని వాటికి ఎలాటి జోళ్ళు కనబడలేదు సరికదా, అంగుళము ధూళి కనబడింది.

సభలో పర్యంతము వారికి, తనకు ఏ విషయంలోను సామ్యము కుదరలేదు. కుక్క విచక్షణత జ్ఞానానికి మెచ్చుకున్నాడు. నిర్భాగ్యుడు అన్నికళ్ళకు లోకువేననుకున్నాడు...

ఆకలి బాధ క్షణ, క్షణానికి ఆచారిని క్రుంగదీస్తుంది. ఆకలిని సూచిస్తు కడుపులో ప్రేగులు అరుస్తున్నాయి కడుపునొప్పి—తల భారం—కళ్ళు చీకట్లు—కాళ్ళ అస్వస్థత మూకుమ్మడిగా ఆచారిపై దాడి చేస్తున్నాయి. ఈ సమస్యల పరంపరకు పరిష్కారమెప్పుడో స్వతహా ఆచారికే తెలుసు.

ఏదో బస్ వచ్చింది. ఆ బస్సుకై నిరీక్షిస్తున్నవాళ్లు వెళ్లిపోయారు. పండ్ల వ్యాపారి కేకలు, సోడావాని అల్లరి, పత్రికలవాని అరుపులు, ప్రయాణికుల గోల కొట్టు తలుపులకు ఆనుకొని నిలబడి పరధ్యానంలో వున్న ఆచారికి లీలగా వినబడుతున్నాయి నల్లగా-పొట్టిగా-లావుగా! ధోవతి-తెల్లకమీజుధరించి, సిగరెట్ కాలుస్తూ, వక్కనములుతూ, త్రేచుతువచ్చాడు కిరాణ దుకాణయజమాని .. మెట్లెక్కాడు... "ఏయ్ హొరేయ్ ముసిలి!" ఈసడించుకుంటూ గద్దించాడు.

పరధ్యానంలో వున్న ఆచారి ఉలుకుపడి, తలుపులను వదిలి దూరంగావెళ్ళి నిల్చొన్నాడు, తప్పుచేసిన ముద్దాయిలా.

కొట్టు తెర్చి, సీలింగ్ ఫ్యాన్ స్విచ్ నొక్కి, అది తిరుగకపోయేసరికి ఎలక్ట్రిక్ డిపార్ట్మెంట్ వాళ్ళను, నానా బూతులు తిట్టుకుంటు, కమీజా విప్పి మేకుకు తగిలించాడు షావుకారి.

ఆ బొజ్జను చూస్తుంటే వినాయకచవితి ఎప్పుడు? అన్న సందేహం రాకపోదు. పొకఅట్ట ముక్కను వెదుక్కొని, తెగ ఆయాసపడుతు మెత్తగాపర్చి వున్న దిండ్లపై ఆసీనుడయ్యాడు... అట్టతో గాలి విసురుకుంటున్నాడు...అవురిస్తు శరీర భారంతో నిట్టూర్చుస్తున్నాడు...

వార్ధక బలహీనము-క్షుద్బాధతో భారంగా తయారయిన శరీరమును యీడ్చుకుంటూ రెండడుగులు నడచి షావుకారిముందు కొచ్చి "బాబు!" అని నీరసంగా పిల్చాడు ఆచారి.

"ఆఁ. ఏం కావాలిరా ముసిలి! చుట్టలా? అగ్గిపెట్టా? ఏంతో త్రయాసంతో అడిగాడు.

"హాఁ. హా...అవేంకాదు బాబు! రెండు రోజుల్నుండి తిండిలేదు. చాల దూరంనుండి నడిచివచ్చి, చెడ్డ ఆకలిగా వుంది!... మీదయ బాబు"

ఓర్చి అన్నట్లు చూశాడు షావుకారి "ఏవూర్రా నీది?" దేనికోసమో వెదుకుతూ అడిగాడు.

షావుకారి చాలమంచివానిలా వున్నాడనుకున్నాడు ఆచారి "పొకవూరని లేదు బాబు! చాలరోజుల్నుండి యిలాగె తిరుగుతున్నాను."

కట్ట బీడీలనుండి పొకటిలాగి ఆచారి ముందుకేసి ఎప్పటిలాగే విసురుకో సాగాడు షావుకారి.

ఆచారి ఆశ నీరు కారిపోయింది. తన అరవై ఏళ్లజీవితములో సిగ్రెత్తాగి ఎరగడు. అలవాటు లేదు బాబు అందామనుకున్నాడు షావుకారి యింతకు మించి ఏమివ్వడని నిర్ణయించుకొని, బీడి తీసుకొని మెట్లుదిగి రోడ్డుపైకి నడిచాడు. పిచ్చివాడు ఎదురై నమస్కారంచేసి చేయిచాచాడు. కృష్ణుని ముందు కుచేలుడు చాచినట్లు... ఆచారి కొంచెం తటపటాయించి, గుప్పిట్లోని బీడిని వాని అరచేతిలో పెట్టాడు...బీద కుచేలునిలా ఆ బీడిని చూడకుండానే నోట్లోకి తోసుకొని చాక్లెట్కంటే ప్రియంగా నమలసాగాడు పిచ్చివాడు...నీరసంగా నవ్వుకొన్నాడు ఆచారి. యీ క్షణంలో పిచ్చివాణ్ణైనా బాగుండేదనుకున్నాడు...కొంతదూరం నడిచాడు.

"తాతోయ్!" సంతోషంగా పిలిచాడు పిచ్చివాడు.

సందేహంతొ తిరిగి చూశాడు ఆచారి... ధీమాతో నమస్కరించాడు పిచ్చివాడు. వాడి వింత ధోరణికి వంకగా అంటుకొన్న ఆచారి పెదవులు కొంచెం వికసించాయి. నవ్వు బయటకు రావటానికి ప్రయత్నించింది. నీవల్లకాదు అన్నట్లు అశక్తి పరిహసించింది. నిస్సహాయుడిగా 'సైన్ బోర్డ్'లను చూస్తూ ముందుకు నడిచాడు...

'శేఖర్ క్లినిక్'అన్న బోర్డ్ చదివాడు. "శే...ఖర్...శే...ఖర్!..హూం!" యీ పేరెప్పడో విన్నట్లు గొణుక్కుంటు; మెట్లెక్కాడు. లోపికి తొంగిచూశాడు...

ఎవరో స్టీల్ చైర్లో వొదిగి కూర్చుని ఏదో ఇంగ్లీష్ మ్యాగ్జైన్ చదువుతున్నాడు, ముందర గోద్రేజ్ టేబిల్పై డాక్టర్ కిట్టు, దానిపైనే 'స్టెతస్కోప్' వుంది. అద్దాల అలమారులో మందులు చాలాచక్కగా అమర్చబడి వున్నాయి


"బాబు!" జంకుతు పిలిచాడు ఆచారి


"ఆఁ ఎవరు?... ఏంకావాలి?... వాట్ డూ యు వాంట్?"... పత్రిక టేబిల్పై పడవేసి- "చెప్పవయ్య! ఏంకావాలి" అడిగాడు డాక్టర్ శేఖర్.

ఆచారి మస్తిష్కంలో తళుక్కున మెరిసినట్లనిపించింది-గుండె దడ దడ కొట్టుకోసాగింది. పెదవులు తడబడుతున్నాయి - ముక్కు అదరుతుంది ... "సందేహంలేదు, వీడు ఆశేఖరే ..ఆశేఖరే.. అవును నుదుటిమీద మచ్చకూడ వుంది" లోలోన ననుకుతున్నాడు ఇంకా పరిశీలించి చూస్తున్నాడు...

"ఏంటయ్య అలాచూస్తావ్?" కోపంగా చూసి పత్రిక ముందర వేసుకొన్నాడు శేఖర్.

...ఆచారి అందమైన ఊహా సౌధాన్ని నిర్మించుకుంటు సంబరపడి పోతున్నాడు...



హాయిగా శ్వాసిస్తున్నాడు– తన రెండురోజుల క్షుద్బాధ యిక వుండదని భ్రమసిపోతున్నాడు .. తనను ఎలా పరిచయం చేసుకోవాలో తెలియక తికమక పడుతూ ప్రక్కకు జరిగి ఆలోచిస్తూ నిల్చొన్నాడు.

* * *

పదహారు సంవత్సరాల క్రితం ఆచారి సిరిపురం గ్రామవాసి. అసలు పేరు సుందరాచారి. అప్పటికి ఆ గ్రామములో ఏ విద్యాశాఖ నిర్వహణకు చెందిన బడిలేదు. కరణంగారి దివాన్ అరుగు బయట, ఆచారే పిల్లలకు పాఠాలు చెప్పేవాడు. ఆ ఆదాయంతోనే భార్య భర్తలు పొట్ట పోసుకునేవారు. సంతానము లేకుండుట వలన కొంచెం వెనుకేస్తూ వచ్చారు కూడా.

ఆచారి విద్యాబోధన చాల ఖచ్చితంగా జరిగేది ''ఒరేయ్ రేపు ఈ పాఠం కంఠస్థం చేసి వొప్పజెప్పాలి లేకుంటే ... అంటే చాలు అదిరిపోయేవారు పిల్లలు ఎంత క్రూరంగా శాసించేవాడో, అంత వాత్సల్యంతో పిల్లల్ని చూసేవాడు. దీనికి కారణం వొకందుకు సంతాన లేమికూడ.

సత్యము పలుకవలెను – పెద్దలను గౌరవించవలెను – ధర్మం చేయువలయును అని పిల్లలచేత అనిపించటమే కాకుండ; ఆచారి కార్యరూపంలో పాటించెవాడు.

నిరక్షరాస్యులకు వుత్తరాలు చదివి, రాసి పెట్టటం తీరిక సమయాల్లో ఓపికతో వినదల్చుకునే వారికి దేశం, దేశరాజకీయల గురించో, శాంతినాయకులు–విప్లవనాయకుల గురించో అనర్గళంగా చెప్పటం ఆచారికి అలవాటుండేది గ్రామస్తులు ఆచారిపట్ల చాల మర్యాద చూపెవారు తెలిసినవారు ఆచారిని పంతుల గారు అని;పామరులు పంతులయ్య అని గౌరవంగా పిలిచేవారు గ్రామస్తులు ఎవరైనా సలహా అడిగిన, సందేహం అడిగిన, సహాయమడిగిన తనకు చేతనైనంతవరకు తీర్చేవాడు పరస్పర సహాయ సహకారాలకు ప్రతిగా కల్తీలేని నెయ్యి దగ్గరనుండి తాజా కాయగూరల వరకు ఉచితంగానే వచ్చేవి.

ఒకనాటి శుభ ముహూర్తాన సిరిపురంలో బ్లాక్‌వారి ప్రైమరి పాఠశాల వెలిసింది.. అధికారులు నియమించిన ఉపాధ్యాయుడు, పెట్టె–బెడ్డింగ్, పిల్ల–జెల్లతో వచ్చాడు సుందరాచారికి వున్న ఉపాధి హరి అంది భార్య భర్తలు దిగాలుపడిపోయారు.. మూడు



నెలలు గడిచాయో లేదో ఒక కాళరాత్రి కలరా వ్యాధి సోకి, సరియైన వైద్యసదుపాయం అందుబాటులో లేక ఆచారి భార్య అలివేణమ్మ చేయి దాటిపోయింది ... ఆచారి పరిస్థితి అరణ్య రోదనలా తయారైంది.

మరో మూడు నెలలు వూర్లో తిరిగాడు బికారిలా మనస్థిమితం లేక క్రుంగి–కృశించి పోయాడు. ఇంకో రెండు నెలలు తిరిగాడు. అభిమానించేవాళ్ళను చూశాడు — జాలిపడే వాళ్ళను చూశాడు. కాని ముందటి ఆదరణ కనపడలేదు–ఆప్యాయత కనబడలేదు పరస్పర సహకారం నశించింది. దగ్గరి బంధువులు కూడ చూసీచూడనట్లు మొఖం చాటేసుకోసాగారు.

ఇక తాను ఎవరికి భారం కాకూడదనుకొని; గూడంత కొంపను అమ్మివేసి, ఓ శీతా

### పిల్లల కోడి

స్పెయిన్‌లో అధిక సంతానం గల కుటుంబానికి బహుమతి వుందట. రెండు సంవత్సరాలనుంచి ఒకే కుటుంబానికి యీ బహుమతి లభిస్తోంది వాలెంటిన్ టోర్రా హెర్నాన్‌డెజ, భార్య మేరియాలకి 18 మంది పిల్లలు పుట్టారట అందులో 17 మంది బతికి వున్నారు. పెద్దాడి వయస్సు 28 · ఏళ్ళ. చిట్టచివరి పిల్ల వయస్సు ఏడాదిట. ప్రస్తుతం భర్త వయస్సు 50 ఏళ్ళ, భార్య వయస్సు 45 ఏళ్ళ.

కాలమునాటి వేకువజామున తన గమ్యాన్ని వెదుక్కుంటూ బయలుదేరాడు ... ఎన్నో యాత్రలు తిరిగాడు. దేవాలయాలుచూశాడు. వసతి నిలయాలు చూశాడు. జాలిగుండెలేని రాతి దేవుళ్ళను చూశాడు – ఆడంబరాలతో, నిత్యనూత్న వైభవాలతో వెలుగొందుచున్న దేవుళ్ళను చూశాడు ... వెంట తీసుకువెళ్ళినవి హరించుకుపోయేంతవరకు చావలేదు... యింక తిరిగాడు. విరక్తి కలిగినప్పుడు–సహనం నశించినప్పుడల్లా, ఆత్మహత్య చేసుకోటానికి ప్రయత్నించాడు. ధైర్యము చాలలేదు. చావలేదు.

ఈ పదహారు సంవత్సరాల పయనములో సుందరాచారి చాల సాధించాడు ఎన్నో కొత్త క్రొత్త ప్రదేశాలు తిరిగాడు–ఎన్నెన్నో క్రొత్త మొఖాలతో, తాత్కాలిక పరిచయం చేసుకొన్నాడు. విభిన్న మనస్తత్వాలుగలవారిని చూశాడు. దొరబాబులను చూశాడు–దోపిడి గాండ్రను చూశాడు. నీతిని చూశాడు అవినీతిని చూశాడు. ఆకలితో స్నేహం చేశాడు– నిద్రతో విరోధం తెచ్చుకున్నాడు ఇంకా బ్రతికున్నాడు–నిరంతర పాంథుడై........

* * *

''అరేయ్ ముసలోడ...!''జరుగు అన్నట్లు సంజ్ఞచేశాడు వెనుకనుండి వచ్చిన హోటల్ కుర్రవాడు. నిక్కర్, బనియన్ మాసివున్నాయి. చంకన ఫ్లాస్క్, నోట్లో బీడి–ముక్కతో పొగవదలుతూ లోనికి వెళ్ళి, ఫ్లాస్కునుకొయ్యకు తగిలించి, చిల్లర టేబిల్ పైపోసి వెనుదిరిగాడు ..

''రేయ్ బాబు... !'' ఐదు పైసల బిళ్ళ కుర్రవాని చేతికిస్తూ; ఇది వానికివ్వు అన్నట్లు తలతో సైగచేసి, పత్రికలో మొఖం దాచుకొన్నాడు శేఖర్.

కుర్రవాడు విసురుగా అందుకొని ఆచారి పైకి గిరాటువేసి వెళ్ళిపోయాడు.

దోవతి కుచ్చిళ్ళ మధ్య యిరుక్కున్న బిళ్ళనుతీసుకుని కొంచెం బాధపడ్డాడు ఆచారి. తనను ఎలా పరిచయం చేసుకోవాలో తెలియని సందిగ్ధంతో ''శేఖర్ బాబు!''అని సాధ్యమైనంత గట్టిగా పిలిచాడు.

''ఆఁ ఎంటయ్యా నీ గోల! నాపేరు నీకెలా తెలుసు?''అడిగాడు శేఖర్.

''మీరు నన్ను గుర్తుపట్టారా బాబు!''

''హుఁ హూ నీ దేవూరు?''

''హొకప్పుడు సిరిపురమే బాబు!''నిర్లిప్తంగా చెప్పాడు ఆచారి.

''ఆహా...''

''నా పేరు సుందరాచారి!'' యికనైనా గుర్తిస్తాడేమోనని ఆశించాడు ఆచారి

''ఫైన్, మనిషికి తగినట్లుగా వుంది!'' పరిహసించాడు శేఖర్.

చివుక్కుమన్నట్లయింది ఆచారికి. తేరుకొని ''మీకు శ్రీకారం చుట్టించిన గురువును బాబు!''అన్నాడు.

''...కావచ్చు, నాకు జ్ఞాపకము లేదు ''

''మీరు సాంబశివరావు కరణంగారి కొడుకు కదూ?''

''అవును.''మాటల్ని ఎక్కడికక్కడే కట్ చేస్తున్నాడు శేఖర్.

''...మీ దివాన్ అరుగుమీదే నేను పాఠాలు చెప్పేవాణ్ణి బాబు! ..ఒకనాడు మీ జామచెట్టు మీదనుండి నన్ను చూసి, భయపడి తొందర్లో దిగబోతు మీరు జారిపడ్డారు. మీ నుదుటి

పీది మచ్చ అదే! జ్ఞాపకముందా బాబు" యింకేం మాట్లాడాలో తోచక అనేశాడు ఆచారి.

"బోర్ కొట్టించక ఏంకావాలో చెప్పు?" లేచివస్తూ అడిగాడు శేఖర్.

"..... . "

పావలా చేతిలో పెట్టి ఎక్కడికో వెళ్ళిపోయాడు శేఖర్

శేఖర్ చర్యకు తెల్లబోయాడు ఆచారి. కొంచెం చలించాడు. గుండెలో తడి ఆరి నొప్పిపెట్టింది పరి పరివిధాల ఆలోచనలతో మెట్లుదిగాడు... భగవాన్! యింకా నన్ను పరీక్షించకు, నా గమ్యాన్ని పరిష్కరించి, నా అలివేణి వద్దకు నన్ను తీసుకుపో, పరివర్తన చెంది, మారి మసగిన యీ ప్రపంచంలో యింకా నన్నుబ్రతికించి, కొందరిని పాపులుగా తయారుచేయకు మ్రూగనివేదనల పరంపరతో రోడ్డెక్కాడు ఆచారి.

నడిరోడ్డుమీద నిల్చొనివున్న పిచ్చివాడు ఆచారి దారికి రెండుచేతులు అడ్డంపెట్టి "హాల్డన్!" అన్నాడు

టకిమని ఆగిపోయాడు ఆచారి.

"సీ బసి య్యాల లేదు! యీ టిక్కుంచుకో, రేపటికి పనికొత్తుంది!" అని వో పాత టిక్కెట్ ఆచారి చేతిలోపెట్టి "రైట్!" అని దారి చూపించాడు.

ఆ టిక్కెట్ జేబులో పెట్టుకుని వాడి మాటల్లోని నిగూఢార్థాన్ని తనకుఅన్వయించుకుంటు మొదటి హోటల్ మెట్లెక్కాడు... కుక్క రొట్టెముక్కల్ని క్రిందేసుకుని నిద్రపోతుంది. బెదుర్తు వెనక్కిచూస్తు లోనికి ప్రవేశించ బోయాడు...

"హారారె! ఎక్కడికి? ఏం కావాలి?" కిల్లీ మూలన వుమ్మేస్తు చిరాగ్గా ప్రశ్నించాడు హోటల్ యజమాని.

"దాహంగా వుందిబాబు! కొన్నీళ్ళిప్పించండి" అడిగాడు ఆచారి.

"సర్లే నువ్వు బయట నిలబడు... వొరేయ్ వాడికో గ్లాస్ నీళ్ళివ్వు"

"... బాబు. రెండురోజుల్నుండి తిండి లేదు! కడుపు మాడిపోతుంది! కాస్త అన్నం పెట్టిచ్చండి బాబు!" ఎలాగో కదిలించాడు ఆచారి

"ఏంటి! అన్నమా?... రెండు రూపాయ

(42 వ పేజీ చూడండి)



ఉన్నాయ ?" మురిపెంగా అడిగాడు హోటల్ యజమాని.

"లేవు బాబు! ముప్పయి పైసలున్నాయి." జేబులోనుండి తియ్యబోయాడు ఆచారి.

చిరునవ్వు నవ్వాడు హోటల్ యజమాని "ముప్పయి పైసలున్నాయా? వాటికి ఎవ్వడు నీ ముందర ఎంగిలి విస్తరికూడ వేయడు. టీ వస్తుంది తాగు"

"టీ ముప్పయి పైసల బాబు?" నిర్ఘాంత పోయాడు ఆచారి.

"ఆఁ! అది యీవాల్టికి! రేపటినుండి ముప్పయయిదు నీకు చదువస్తుందా? అక్కడ బోర్డ్ కట్టాము చూడు."

"బాబుగారు దయచూపించండి! కడుపు మండిపోతుంది. ఏ పట్టెడన్నము పెట్టించండి! ప్లీజ్..."

"ఛఛ! ఏంట్రా బిడ్డలా!... ఒరేయ్ మూర్తి... ఓ టీ, ఓ రొట్టె పట్రా...ఆ ముప్పయి పైసలక్కడపెట్టు—మా ప్రాణాలు తియ్యటానికే పుట్టార్రా మీరంతా ఛిఛి!" చాల విసుక్కుంటు అన్నాడు హోటల్ యజమాని.

ఆచారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి శిలా విగ్రహంలా నిల్చుండిపోయాడు. తలదిమ్ముగా నొప్పిగావుంది—చిన్నగా కడుపు నొస్తుంది— చెవుల్లో కీచురాళ్ల శబ్దంలా వినపడుతుంది— కళ్లు చీకట్లు గ్రమ్ముతున్నాయి. తన చివరిసారి ఆత్మహత్య ప్రయత్నం ఫలించి


రాయలసీమకు

ఆంధ్రపత్రిక

మీ మీ ప్రాంతాలకు చెందిన తాజా వార్తలతో, ఇప్పుడు ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి వెలువడుతున్నది చందాదారులుగా చేరండి!

రేట్లు:

| | |
|---|---|
| సంవత్సర చందా | 95—20 |
| 6 మాసాలకు | 47—60 |
| 3 మాసాలకు | 24—30 |

చందా కట్టవలసిన చిరునామా: మానేజర్, ఆంధ్రపత్రిక: బషీర్ బాగ్, హైదరాబాద్—500029.


## చక్రడోలు

(9వ పేజీ తరువాయి)

వుంటే, ఎంత బాగుండెదనుకున్నాడు. ఎందుకు కొరగాని యీ తనువునుండి జీవుడు వేరయి, పరమాత్మలో కలియక పోయెనేనని విలపించాడు ... కళ్ళల్లో నీరు యింకిపోయింది, గుండెలో తడి ఆరిపోయింది. మౌనంగా తలవంచుకొని నిల్చొన్నాడు.

హోటల్ కుర్రవాడు టీ గ్లాసు క్రింద పెట్టి, దానిపై రొట్టె పెటి, స్తంభించి పోయిన ఆచారిని చూస్తూ వెళ్లిపోయాడు.

రొట్టెనుచూస్తు గుటకలు వేస్తూ, చప్పున కూర్చుండిపోయాడు ఆచారి. ఆవురావురంటు రెండు నిముషాల్లో ముగించి ఖాళి గ్లాసును గద్దెపై పెట్టాడు. రెండు నిముషాల తర్వాత కడుపుబగ్గున మండినట్లనిపించింది. మూలకు జరిగి మోకాళ్ళపై కూర్చుండి పోయాడు...

తుక్కు చిమ్ముతున్న కుర్రవాడు పిలిచేంత వరకు తేరుకోలేకపోయాడు అలా ఏంతసేపు కూర్చుండిపోయాడో ఆచారికి తెలియదు. తిన్నగా లేచి హోటల్ యజమాని ముందు కొచ్చాడు.

"అఁ, వెళ్లు! వెళ్లు!" ఇంకా ఏదయిన అడుగుతాడేమోనని ముందుగానే హెచ్చరించుకున్నాడు హోటల్ యజమాని

"ఏదయిన పనివుంటె యిప్పించండి బాబు!" తాను తిరుగుతు వచ్చిన అన్ని చోట్ల అడిగినట్లే, మామూలు ఉపోద్ఘాతాన్ని యిక్కడకూడ మొదలు పెట్టాడు.

"పనా!... యిక్కడ నువ్వుచేసే పనేమి లేదు వెళ్లు"

"అలా అనకండి బాబు! ఏపనైనాసరె చేస్తాను"

"కట్టెలు కొట్టడమొచ్చా?" వ్యంగ్యంగా అడిగాడు హోటల్ యజమాని.

'...'నిస్సత్తువను ప్రకటించాడు ఆచారి.

"నీళ్ళు మోయడం చాతనవుతుందా?"

"...ఇంకేదయినా పనివుంటె చెప్పండి బాబు!"

"యింకేం చాతనవుతుంది నీకు!... అఁ బస్సుల్లో వచ్చి పోయెవాళ్ళకు నీళ్ళందిస్తానా? అడిగాడు హోటల్ యజమాని.

"అఁ! చేస్తాను బాబు!"

ఉదయం తొమ్మిది నుండి, సాయంత్రం ఏడుగంటల వరకు చెయ్యాలి. ఏమాత్రం అడుగుతావ్?" అడిగాడు హోటల్ యజమాని.

"మీదయబాబు!"

'అలాసిల్లేదు! ఇప్పుడేఖచ్చితంగా అడుగు.'

"రెండు పూటలు కొంచెం అన్నం పెట్టించండి!" అదే మహాభాగ్యంలా అడిగాడు ఆచారి.

"ఏంటి! రెండు పూటలా? వొరె పిచ్చి మొహమా, రెండు పూటలంటే ఈ రోజుల్లో, నాల్గు రూపాయలు కావాలి తెల్సా?... అదేం కుదరదు రోజుకో రూపాయ్యిస్తాను చేస్తావా? ఖచ్చితంగా తేల్చుమన్నట్లు అడిగాడు హోటల్ యజమాని.

"వొక్కపూటయిన అన్నం పెట్టించండి బాబు!" దీనంగా అడిగాడు ఆచారి.

"అయితే వెళ్ళు" నిర్లక్ష్యంగా మొఖం తిప్పకున్నాడు హోటల్ యజమాని.

"సరేబాబు! ఆ వొక్క రూపాయె యివ్వండి."

"డబ్బులుమాత్రం మొదలడు గొద్దు. రోజా సాయంత్రమే యిస్తాను. అలా అయితేనే రేపుదయంనుండి పనిలోకి రా."

"సరేబాబు...!" నమస్కరించి కదిలాడు ఆచారి.

* * *

దీర్ఘప్రయాణంలో స్వల్పవ్యవధి విశ్రాంతికై, వచ్చిన బస్ ఆగిపోయింది. "అఁ హైద్రాబాద్ అర్ధగంట." స్టాండ్ ప్రధాన కూలి బీడి పారేస్తూ గట్టిగా అరిచాడు.

చిన్న తడికెల గుడిసెలోనుండి ప్లాస్టిక్ జాడి అల్యూమినియమ్ గ్లాసుతో, అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చాడు ఆచారి. స్టాండ్ వ్యాపారులు తమ అమ్మకం వస్తువుల పేర్ల వివరాలను గట్టిగా చెప్పకుంటూ బస్ చుట్టూ తిరుగుచున్నారు. 'క్యూ' సిస్టమ్ ఆచరణలో అసాధ్యం. అన్నంత ఖచ్చితంగా ప్రయాణీకులు కలియబడుతున్నారు.

"మంచినీళ్ళు బాబు!...మంచినీళ్ళు! .." అనుకుంటూ అడిగినవారికల్లా క్రమంగా యిస్తున్నాడు ఆచారి. మధ్య మధ్య తడికెల గుడిసెలోకి వెళ్తూ, జాడిలో నీళ్ళు నింపుకొంస్తున్నాడు.

"ఏయ్ నీళ్ళు?" పిలిచాడు చివరనున్న నల్లకళ్ళద్దాల మనిషి.

గ్లాసు కడిగి, ముందునుండి చివరకువెళ్ళి,

వో గ్లాసెడు నీళ్ళుపోసి యిచ్చాడు ఆచారి.

కళ్ళద్దాల మనిషి తీసుకొని, ప్రక్కనే కూర్చున్న భార్యకిచ్చాడు—పుక్కిలించిన నీళ్ళను బయటకుమ్మేస్తూ, ఆచారిని చూసిందామె.

"ఈ నీళ్ళెవ్వరిచ్చారండి?" రుస రుస లాడుతూ భర్త నడిగింది.

"ఏమైనా చెత్త వచ్చిందా?" అపరాధం జరిగినట్లు అడిగాడు భర్త.

"ముందు చెప్పండి?"

ఆయనే అన్నట్లు తలతో చూపించాడు భర్త.

"అయితే ఈ నీళ్ళు వాని మొహానే కొట్టండి!" గ్లాసు భర్త చేతిలో పెట్టింది.

"ఏం జరిగింది సంధ్యా?" తడబడుతు అడిగాడు భర్త.

'వాడి మొహం చూస్తేనే డోకొస్తుంది! ఎలా తీసుకున్నారండి? బుద్ధి లేకపోతేసరి. యిచ్చేవాడికి సిగ్గు లేకపోయినా...'




ఆచారికి కూడా ఆమె అంటున్న మాటలు వినబడుతున్నాయి.

నల్లకళ్ళద్దాల మనిషి మొఖం పెట్టుకున్న అద్దాలకంటె ఎక్కువ నల్లబడిపోయింది. భార్య అంటున్న మాటలు ఎవరైనా వింటున్నారేమోనని చుట్టుప్రక్కల వాళ్ళను పరిశీలించి చూస్తూ, గ్లాసు బయటకు పెట్టాడు.

"...దాహంతో చస్తున్నా! కాస్త హోటల్ నుండి పట్రండి" భర్తను రెట్టించింది.

గ్లాసు తీసుకొని నిశ్శబ్దంగా తడికెల గుడిసెవైపు నడుస్తున్నాడు ఆచారి. 'వాడి మొఖం చూస్తేనే డోకొస్తుంది'. ఆమె అన్న మాటలు చెవుల్లో గింగుర్లు తిరుగుతున్నాయి...

"ఏయ్ భీష్మాచార్యులు" అని వేపచెట్టు క్రింద వున్న యువకత్రయంలోనుండి. చప్పట్లు కొడ్తూ, ఆచారిని పిలిచాడొక్కడు, ఆధునిక నాగరికంగా, భారతదేశ అభివృద్ధికి నిదర్శనంగా, ఈ ముగ్గురిని పేర్కొనవచ్చు. అలా వున్నారు. చేతుల్లోని పుస్తకాలను, విలాసంగా త్రిప్పుతూ నిల్చొని ఉన్నారు.

"..నీళ్ళు కావాలా బాబు ?" వారిని సమీపించి అడిగాడు ఆచారి.

"అందుకేగద బాబు పిలిచాం!" జోక్ చేశాడు. నుదురు చెవులు, మెడ కనిపించకుండా, వెంట్రుకలు పెంచుకున్న యువకుడు.

నీళ్ళు పోసిచ్చాడు ఆచారి.

నీళ్ళందుకొని, నోట్లో పోసుకొని ఉమ్మేసి "నీళ్ళు పొయ్యిమీదినుండి తెచ్చారా తాతగారు" అని వ్యంగ్యంగా అడిగాడు. వున్న చిన్న మొఖం కాస్త కనిపించకుండా, వెంట్రుకలు, బండి చక్రాల్లాంటి కళ్లద్దాలతో మొఖాన్ని దాచుకున్న యువకుడు.

ముగ్గురు గొల్లున నవ్వారు. ఆచారివద్ద నుండి జాడి తీసుకొని, వొకరి తర్వాత వొకరు చెట్టు చాటుకు వెళ్ళి, చెమట మొఖాల్ని కడుక్కొన్నారు.. ఈ వ్యవధిలో ఏదో పోగొట్టుకున్నవారిలా, లేడీస్ శల్టర్‌లోకి, నిల్చొనివున్న బస్‌లోకి గుచ్చి, గుచ్చి చూడసాగారు.

"వారేయ్, పోయిందిరోయ్!" మోచేత్తో ప్రక్కవాన్ని పొడుస్తూ దిగాలుపడిపోయాడు మూడవవాడు. నేను మనిషినే; అన్న స్వంత హామి యిచ్చేంతవరకు, ఎవ్వరు ఆయనతో ఏకీభవించరు. అలా ఉన్నాడు.



"పోయిందట్రా ?" నోరు తెర్చాడు ప్రక్కవాడు.

నిశ్చేష్టుడయి వారి నడతలనే చూస్తున్నాడు ఆచారి.

"...వారే బ్లేండ్స్! ఆ సూర్యకాంతం వెనకాల వుంది చూడండి..." చూయించాడు అద్దాల యువకుడు.

వారి బాధ్యత–క్రమశిక్షణ రహితానికి నొచ్చుకున్నాడు ఆచారి. వారి దుష్ప్రవర్తన, అర్థంలేని నవీన, నాగరిక అలంకారాలనుచూసి; ఈ యువతరమంతా యిలాగే తయారైతే దేశ భవిష్యత్ ఏమిటని ఆలోచించసాగాడు...

"...ఏమండి తాతగారు! ఏ అమ్మాయినయినా నేకెడ్‌గా చూశారా ఏంటి అలా కొయ్యబారిపోయారు ?" గేలి చేశాడు మూడవవాడు.

యిక అక్కడ వోక్షణంకూడా వుండకూడదనుకొని, వెనుదిరిగాడు ఆచారి.

**వాగుడుకాయ**

24 ఏళ్ల టిమ్‌హార్టీ (మిన్నిసోటా, అమెరికా) ఈ మధ్య ఏక బిగిన 144 గంటలు మాట్లాడి ప్రపంచ రికార్డు స్థాపించాడు. పూర్వపు రికార్డు 138 గంటలట

స్టాండ్ కూలీలు మూకుమ్మడిగా చేరి, కీచులాడుకుంటు, చెడ్డబూతులు తిట్టుకుంటున్నారు. మధ్య మధ్య నవ్వుకుంటు కలియబడుతున్నారు.

"ఏయ్ నీళ్ళ ముసలాడా..." ఆచారిని పిలిచాడు స్టాండ్ ప్రధాన కూలి.

ఆచారి వార్ని సమీపించి గ్లాసులో నీళ్లు పొయ్యబోయాడు.

"యియ్యద్దు ? యీ విద్యగాడ్లు ఈ యీ రెండు పిలాస్టిక్ లోటాల నిండా నీళ్లు తాగ్తామని, పందెం కాసుకుండ్రు. యిద్దువు పదా..." అన్నాడు ప్రధానకూలి.

అందరు తడికెల గుడిసె వైపు నడిచారు.

* * *

సాయంత్రం ఐదుగంటలవుతుంది. క్రితం రోజుకంటె ఎండ కొంచెం విరిగింది. వడగాలి హోరున వీస్తోంది.

ఆచారి ఆకలి బాధ సూర్యునికి గజం దూరంలోవున్నంత మండిపోతుంది–పరిస్థితి మరికొంచెం క్షీణించింది. ప్రయాణికులకు, స్థానికులకు అడిగిన వారికల్లా జీవచ్ఛవంల్లా నీళ్ళందిస్తూనే వున్నాడు... తలఎత్తి ప్రొద్దు చూశాడు. యింకా రెండు, రెండున్నర గంటలు ఓపిగ్గా సర్దుకుపోవాలి రూపాళ్లు వస్తుంది. ఏదైనా తినవచ్చు అనుకున్నాడు వేవిళ్ళబాధను అణచిపెట్టుకునే ఉద్దేశ్యంతో, యింకో మూడుగ్లాసుల నీళ్ళు తాగాడు.

"ఆం! హనుమకొండ, వరంగల్ ఎక్స్‌ప్రెస్" అరిచాడు కూలివాడు

అరువువిన్న ఆచారి, తడికెల గుడిసెలో నుండి నీళ్లు తీసుకొని రెండడుగులు నడిచాడు. కాళ్లు తడబడినాయి. కళ్లకు ఏమీ కనబడలేదు వోక్షణం చుట్టు తడుముకున్నాడు గజ, గజ వణకుతు, అటు యిటు సొలగుతు, మండుతున్న నేలపై నిటారుగా పడిపోయాడు... గ్లాస్, నీళ్ళజాడి ఆచారికి యిరువైపుల పడి వున్నాయి. నీటి రూపంలో ఏకధాటిగా వాంతి చేసుకోసాగాడు ఆచారి.

స్థానికులు ప్రయాణికులు ఆచారి చుట్టు మూగారు.

వో పావుగంట తర్వాత హోటల్ యజమాని వచ్చి, జరిగిన సంగతి తెలుసుకొని, జనాల్ని తోసుకుంటు లోనికి వెళ్ళాడు.

"దా. హం! హుం ..దా...హ..."ఆచారి సన్నగా గొణుగుతున్నాడు.

రెండు నిముషాలు చూసి గ్లాస్, జాడి కుర్రవానిచేత పట్టించుకుని వెళ్ళిపోయాడు హోటల్ యజమాని.

జనాలు మూగివుండటం చూసి, డిస్పెన్సరి వైపు వెళ్తున్న డాక్టర్ శేఖర్, ఆచారి పడివున్న చోటుకు వచ్చాడు "ఏం జరిగింది?" అడిగాడు వొకతన్ని. పరిస్థితి వివరించి చెప్పాడు, ఆ పెద్దమనిషి. కొందరు ప్రక్కకు తప్పుకొని శేఖర్‌కు దారిచ్చారు... ఆచారిని చూసి తెల్లబోయాడు శేఖర్.

"హుం...దా...హం...హుం..." ఆచారి నిలువెల్లా వణికిపోతున్నాడు. మాటలు గొంతులోనే విరిగిపోతున్నాయి.

"యీాయిన కెవ్వరయినున్నారా?"ఆచారికి స్వల్పదూరంలో నిల్చుండి, కొంచెంసేపుచూసి ఎదురుగా వున్న వాళ్ళను చూస్తు అడిగాడు శేఖర్.

"ఏ కలీ హాయా డాక్టర్ సాబ్. యాా కా నయ్యా హై" కూలీలలో నుండి చెప్పాడొక్కడు.

"చూస్తుంటే పరిస్థితి ప్రమాదంగానే వుంది! గ్లూకోజ్ యిస్తే బ్రతుకొచ్చు."

తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు శేఖర్.

"గ్లూకోజ్ యిస్తే బ్రతుకుతాడట!" "గ్లూకోజ్ యిస్తే బ్రతుకుతాడట!" అని ముందున్నవాళ్లు, వెనుకున్నవాళ్ళకు చెప్తూన్నారు. "గ్లూకోజ్‌కూడ కల్తీదే వస్తుందటగా, యీ రోజుల్లో!" వెనుకున్న యువకత్రయంలోనుండి పెదవులు వింతగా ఆడిస్తూ అన్నాడు, కళ్ళద్దాలయువకుడు. కొందరు గొళ్ళున నవ్వారు. పిల్లికి చెలగాటం—ఎలుకకు ప్రాణసంకటంలా తయారైంది ఆచారి పరిస్థితి.

"దా...హం...హూ......" నాలుకను పెదవులమధ్య త్రిప్పుకొంటున్నాడు ఆచారి,

"కొన్నీళ్ళు పట్టండయ్యా పాపం!"... "మంచినీళ్లు తెండయ్యా!"..."జర్దా పానీలావ్ బాహి"...అని ఒక్కొరికొక్కరు చెప్పుకుంటున్నారు. కాని ఎవ్వరు వెళ్ళటంలేదు. ఆచారి చుట్టూ వున్న ఎందరికో దాహంతీర్చాడు. కాని ఆచారి దాహం తీర్చటానికి, ఎవ్వరు సాహసించటంలేదు. తోటి మానవులయినందుకు, ఆచారిని నీడకు తీసుకెళ్ళి, పండబెడదామని కూడా; ఎవ్వరూ ఆలోచించటంలేదు. గారడి చూసినట్లు చూస్తున్నారు వేడిమిభరించలేక చూసినవాళ్ళు వెళ్ళిపోతున్నారు. కొత్తవాళ్ళు ఏదైనా వింతప్రదర్శన నేమోనని నడకను హెచ్చిస్తూ వస్తున్నారు.

సాయంత్రం ఏడుగంటలు దాటింది. ఇప్పుడు ఆచారి వీపుమండుతుందని, బాధపడటంలేదు—ఆకలవుతుందని, చింతించటంలేదు—దాహమని అర్థించటంలేదు. చాల ప్రశాంతంగా వున్నాడు. మొఖంపై ఈగలు సయ్యాటలాడుకొంటున్నాయి.

* * *

హోటల్ రేడియోనుండి వార్తలు వినబడుతున్నాయి—

...విశేషాలు మరొకసారి... అధికధరలకు నిరసనగా, నేడు విజయవాడ బంద్ జరిగింది యాభై లక్షల టన్నుల ధాన్యం దిగుమతి చేసుకోటానికి, ఇండియా ప్రయత్నిస్తున్నట్లు, అమెరికాలో ఒక వ్యవసాయ నివేదికలో ప్రకటించారు.. రాష్ట్ర ఆహార గిడ్డంగులలో, ఆహారనిల్వలు సమృద్ధిగా వున్నాయని, పంపిణీ సవ్యంగా జరుగుతుందని, ఆకలిచావులు సంభవించాయన్న వార్తలు వట్టి పుకారులేనని, రాష్ట్ర ముఖ్యమంత్రి నేడొక బహిరంగసభలో చెప్పారు...వార్తలు...సమాప్తం—

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున వెలువడిన అపూర్వ గ్రంథం

## తెలుగు పలుకుబడుల తీరు తెన్నులు

తెలుగుభాష సొయగమును గూర్చి, సొంపుసుగూర్చి డా. ప్రకాశచంద్ర శతపథి గారిచే వ్రాయబడినది.

ఆంధ్రభాష ద్రావిడ భాషా జన్యంగాదని, ఆర్య సంస్కృతిని పుణికి పుచ్చుకున్న భాషయని—సంస్కృత పలుకులు తెలుగుభాషలో యే విధముగా తమ నిజరూపాన్ని కోల్పోయినదీ ఎన్నో విశేషాలు వివరించిన బృహద్గ్రంథం.

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి పీటికతో ప్రముఖుల అభిప్రాయాలతో 340 పుటలు గ్రథం రు 10/— ప్రతి తెలుగువాడూ చదువవలసినది. ప్రతి గ్రంథాలయంలో వుండవలసినది. కాపీలు కావలసినవారు ఈ దిగువ విలాసమునకు పైకం పంపగలరు.

**కస్తూరి ప్రచురణలు, ప్రకాశం నగర్ కృష్ణలంక, విజయవాడ.**

## కేశవర్ధని

పొడుగైన, నిగనిగలాడు సిల్కువలె మెత్తని శిరోజములకు

మృదువైన, సువాసన గల శిరోజములకు కేశవర్ధని షాంపూ

కేశవర్ధని ప్రొడక్ట్సు
ఆర్కాట్ రోడ్, మద్రాసు-600087




డిస్ట్రిబ్యూటర్లు : ప్రగతి ఏజెన్సీస్, పులిపాటివారి వీధి, విజయవాడ-1.